ఉద్యోగాలు తొలగించడం తగదు : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : వైసిపి అధికారంలో వచ్చిన నాలుగు నెలల్లోనే నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించిందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. త్రేతా యుగం నుంచి సనాతన ధర్మం నడుస్తుందని సనాతన ధర్మాన్ని తానే కనిపెట్టినట్లు పవన్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అతివృష్టి అనావృష్టి ఉంటే వాటిని పరిష్కరించకుండా నీచపు రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఖరీఫ్‌కు రైతు భరోసా ఇచ్చి అనావృష్టితో సతమతమవుతున్న రైతులకు అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కడప కొప్పర్తికి ఎంఎస్ఎంఇ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ తీసుకొస్తే కూటమి ప్రభుత్వం రాయలసీమలో లాయూనివర్సిటీని శ్రీభాగ్ వాడంబాడిక ప్రకారం ఉండాల్సిన హైకోర్టును వేరే చోటికి తరలిస్తున్నారు. రాయలసీమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని రాజకీయ నాయకులకు ఎవరి ప్రాంతాలపై వారికి మక్కువ ఉంటుందని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, నాయకులు మహమ్మద్‌ఖాన్, వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టు ప్రమాదంపై విచారణ!

- తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇకి ఆదేశాలు
- త్వరలో విచారణ చేపట్టే అవకాశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అన్నమయ్య ప్రాజెక్టు గల్లంతు ఘటనపై విచారణకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వం గురువారం తిరుపతి క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ, కడప జిల్లాకు చెందిన ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సహా పలువురు సహాయకులతో కూడిన బృందం విచారణ చేపట్టాలని ఆదేశించింది. 2021 నవంబర్ 17న అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగిన ఘటనకు దారి తీసిన పరిస్థితులు, ఇందులో సంబంధిత ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఎంత, రాజకీయ నాయకులకు చెందిన ఇసుక డంపుల పాత్ర ఏమైనా ఉందా, ఉంటే ఎంత, వాస్తవంగా తుపాన్ ప్రభావిత వర్షపాతం ఎంత, రిజర్వాయర్ గల్లంతు కావడం వెనుక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే అంశాలపై లోతుగా విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. విచారణ కమిటీలో గతంలో అన్నమయ్య రిజర్వాయర్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన అధికారి కూడా ఉండడం గమనార్హం. సంబంధిత విచారణాధి కారుల ఇంజినీరింగ్ అధికారుల బృందం లోతుగా విచారించనుంది. అనంతరం అన్నమయ్య రిజర్వాయర్ మట్టికట్ట తెగడానికి సంబంధించిన వాస్తవాలతో కూడిన నివేదికను చీఫ్ ఇంజినీర్‌కు అందజేయాలని ఆదేశించింది. చీఫ్ ఇంజినీర్ పరిశీలన అనంతరం ప్రభుత్వానికి కమిటీ నివేదికను అందజేసే అవకాశం ఉంది. అనంతరం విచారణ కమిటీ అందించిన నివేదికను అనుసరించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్ ఫొటో)

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు : కలెక్టర్

విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు 2వ వంద రోజుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2వ వంద రోజుల ప్రణాళిక రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టితో విజన్ ఆంధ్ర-2047 తీసుకువచ్చారని తెలిపారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న రెండవ వంద రోజులు అనగా డిసెంబర్ 31 నాటికి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు ఏమిటి, ఏ విధంగా లక్ష్యాలు సాధించగలం, అందుకు తీసుకోవలసిన చర్యలు తదితరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీలోగా రెండవ వందరోజుల ప్రణాళికలో భాగంగా ఆయా శాఖలలో అమలు చేయాల్సిన ప్రధానమైన కార్యక్రమాలు ఏమిటి, ప్రతి అంశానికి సంబంధించి వాటి పరిమితులు, వాటి ప్రధాన లక్ష్యం, ఉప లక్ష్యాలు, చేపట్టే, చేపట్టాల్సిన అంశాలు, వార్షిక లక్ష్యాలు ఎంత, ఇందులో సాధించాల్సిన భౌతిక, ఆర్థిక లక్ష్యం ఎంత, లక్ష్యసాధనకు తీసుకోబోతున్న చర్యలు తదితరాలలో శాఖల వారీగా జిల్లా అధికారులతో కూలంకషంగా చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఆశించిన ఫలాలు అందుకునేందుకు సమగ్ర నివేదికలు రూపొందించాలన్నారు. రానున్న ఐదు సంవత్సరాల (2024-25 నుండి 2028-29)లో జిల్లాను అన్ని రంగాలలోఅభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఒ వెంకట్ పెద్దయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

- ధర్నాలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉచిత ఇసుక విధానాన్ని తక్షణ అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి. హెచ్.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం టోల్గేట్ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక అందుబాటులో లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని చెప్పి వంద రోజులు దాటిన ఇసుక అందుబాటులోకి రాలేదన్నారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి ఏం తేడా కనిపించలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో కన్నా అధిక రేట్లకు ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశార. ఒక టిప్పర్ గతంలో రూ.13 నుంచి రూ.15 వేలకు వచ్చేదని, నేడు అది రూ.22 వేలకు అమ్ముతున్నారని తెలిపారు. ట్రాక్టర్ గత ప్రభుత్వంలో రూ.5 వేలకు ఇచ్చేవారని నేడు రూ.ఎనిమిది వేలకు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత ఇసుక పాలసీ ఎక్కడ అమలు అవుతోందని ప్రశ్నించారు. బాలరాజుపల్లి, బుడుగుంటపల్లి స్టాక్ యార్డ్ నిల్వ చేసి కొనుగోలు అమ్మకాలు చేయడం ఖర్చుతో కూడుకున్నదన్నారు. రెండింతలు ఖర్చవుతుందన్నారు. టన్నుకు రూ.370 రవాణా ఛార్జీల పేరుతో బ్లాక్‌లో కొన్నట్లు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇసుక అందుబాటులో లేదన్నారు. భవన నిర్మాణ కూలీలకు పనులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇసుక రీచ్‌లు అధికంగా విడుదల చేయాలన్నారు. నంద లూరు, టంగుటూరు, గుండ్లూరు, నారాయణ నెల్లూరు, మందరం, బెస్తపల్లి పెనగలూరు, తదితర క్వారీలకు అనుమతిలివ్వాలని, ట్రాక్టర్లకు, ఎడ్ల బండ్లకు అనుమతులు ఇవ్వాలని, టిప్పర్లకు, లారీలకు నిషేధ విధించాలని డిమాండ్ చేశారు.

రాయచోటి టౌన్ : ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి జి.మాధవయ్య అన్నారు. మండల కేంద్రంలోని సిపిఎం రూరల్ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని మరచి పేదల సొంత ఇంటి కలను నాలుగునెలల నుండి నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. సంక్షేమ బోర్డును గాలికి వదిలి నిర్మాణ కార్మికులను నట్టేట ముంచుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గత ప్రభుత్వ విధానాలతో నిర్మాణ కార్మికుల జీవితాలు పనులు లేక చిన్నాభిన్నం అయ్యాయని బాధ పడ్డారు. ఇప్పటికీ నాలుగు నెలలు అవుతున్నా నిర్మాణ కార్మికుల గురించి ఆలోచించక పోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలుపరిచే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ పెండింగ్ ఉన్న క్లైమ్‌లు పరిష్కారం చేస్తూ నిర్మాణ కార్మికుల నమోదు ప్రక్రియ కొనసాగించాలన్నారు. అనంతరం సిపిఎం కార్యకర్తలు రాయచోటి ప్రజలకు ఇసుక రీచ్ ఏర్పాటు చేసి ఉచితంగా ఇవ్వాలననినాదాలు చేస్తూ ధర్నా చేశారు. కార్యక్రమంలో పిటిఎం భవన నిర్మాణ కార్మికులు ఓబుళమ్మ, సుధాకర్, సావిత్రి, వెంకటేష్, శ్రావణి, కిట్టయ్య పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : టోల్‌గేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

రాయచోటి : నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

మంగంపేటలో బ్లాస్టింగ్ పనులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-పుల్లంపేట

మంగంపేటలోని ఎపిఎండిసిలో బైరైటీస్ గనుల తవ్వకంలో యాజమాన్యం చేపడుతున్న హై బ్లాస్టింగ్ పనులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేటలోని అగ్రహారంలో బ్లాస్టింగ్ వల్ల కూలిన ఇళ్లను పరిశీలించారు. గ్రామస్తులు చెప్పిన విషయాలను విలేకరులతో మాట్లాడుతూ ఎపిఎండిసి నిర్మాణంలో గ్రామస్తులు భూములు ఇచ్చినప్పటికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా నేటికీ గ్రామస్తులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. హై బ్లాస్టింగ్ వలన గ్రామంలో పులుకుంట గోపి అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా నేలమట్టమైందన్నారు. ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో 70 ఇళ్లలు తీవ్ర బ్లాస్టింగ్ కంపనాలతో ఇంటి గోడలు బీటలు వచ్చి నెర్రలు వచ్చాయని చెప్పారు. గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని జీవిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు అగ్రహారం గ్రామం సందర్శించి బ్లాస్టింగ్ పనులు ఆపి, గ్రామ ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించి ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గ్రామస్తులు పి.శ్రీనివాసులు, జి.శివశంకర్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

మదనపల్లె : శాంతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

చిన్నారి అస్పియా హత్య హేయమైన చర్య

- శాంతి ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిన్నారి అస్పియా హత్య అత్యంత హేయమైన చర్య అని, హంతకులను ఉరి తీయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. అస్పియా కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిన్నారి అస్పియా ఆత్మకు శాంతి చేకురాలని శుక్రవారం మదనపల్లె బెంగుళూరు బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ సాయంత్రం ఏడు గంటల వరకు కూడా ఇంటి వద్ద ఆడుకుంటున్న అస్పియా ఆ తరువాత కిడ్నాప్‌కు గురైందన్నారు. అస్పియా కనబడక పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ కుమార్తె కోసం రెండు రోజులు తీవ్రంగా వెదికారని తెలిపారు. విధి వెక్కిరిస్తూ స్థానిక సమ్మర్ స్టోరేజ్‌లో అస్పియా మృతదేహమై కనిపించడం హృదయాన్ని ఎంతో కలచి వేసిందన్నారు. ఈ ఘటనను మదనపల్లె వాసులుగా మేమందరం పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. చిన్నారి మృతికి కారణమైన వారిని వెంటనే పట్టుకొని ఉరిశిక్ష విధించాలని కోరారు. బెంగుళూరు బస్టాండ్‌లోని జామియా మసీదు నుంచి సబ్ కలెక్టర్ వరకు జరిగిన శాంతి ర్యాలీలో పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

కలకడ: అస్పియాను హత్య చేసిన హంతకులను ఉరి తీయాలని మండల యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గత నెల 29వ తేదీన తప్పిపోయిన చిన్నారి బుధవారం శవంగా కనిపించడం దారుణమని వారన్నారు. ఈ విషయంగా పుంగనూరు పట్టణంలో సంచలనానికి దారి తీసిన అస్పియాకు మనసుకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఆ చిన్నారికి న్యాయం జరగాలన్నారు. ఇలాంటి ఘాతకానికి ఒడిగట్టిన వారిని వెంటనే గుర్తించి బహిరంగంగా ఉరితీయాలని అప్పుడే ఆ కుటుంబ సభ్యులకు చిన్నారికి మనశాంతి కలుగుతుందని కోరారు.

వాల్మీకిపురం: పుంగనూరుకు చెందిన ఆరేళ్ల చిన్నారి అస్పియా మరణం చాలా బాధాకరమని వాల్మీకిపురం జెఎసి విచారం వ్యక్తం చేసింది. శుక్రవారం రాత్రి వాల్మీకిపురంలో అస్పియా మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కొవ్వొత్తులతో పట్టణ పురవీధులలో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు వద్ద చిన్నారి మరణం పట్ల మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారి అస్పియ మరణానికి కారకులైన వారిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అన్ని మతాల పెద్దలు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

వాల్మీకిపురం: జెఎసి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రాహుల్‌ను విమర్శించే అర్హత పవన్‌కు లేదు

ప్రజాశక్తి-పీలేరు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక తన వేష, భాషలు మార్చారని, రాహుల్ గాంధీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఆయనకు లేదని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ తెలిపారు. శుక్రవారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ సెక్యూలర్ పార్టీగా ఉన్న జనసేన కాస్త రైటిస్ట్ పార్టీగా మారిందా అనే సందేహం రాష్ట్ర ప్రజలకు కలుగు తోందన్నారు. బాధ్యతగల పదవిలో ఉంటూ, ఒక మతానికి చెందిన వేషం వేసుకుని, ఆ మతమే ముఖ్యమని మాట్లాడుతుంటే ఇతర మతాల్లోనివారిలో అభద్రతాభావం కలగదా అని ప్రశ్నించారు. మతం అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతమైతే అదే సిద్ధాంతానికి పవన్ డబుల్ ఏజెంట్ అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీ దర్శకత్వంలో యాక్టింగ్ చేసే పవన్‌కు రాజీవ్ గాంధీ గురించి మాట్లాడే నైతికత లేదని మండిపడ్డారు. మణిపూర్, గోద్రాలలో ఊచకోత కోసింది బిజెపి కాదా అని ప్రశ్నించారు. అటువంటి పార్టీకి మద్దతు ఇచ్చిన మీరు లౌకికవాదం పాటించాలని చెప్తే నమ్మమంటారా అని పేర్కొన్నారు. పిచ్చి పిచ్చిగా మాట్లాడితే అదే రీతిలో సమాధానం ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు పిఎం కిసాన్ నిధులు విడుదల

ప్రజాశక్తి-రాయచోటి : 18వ విడత పిఎం కిసాన్ నిధులను ఈ నెల 5న మహారాష్ట్ర నుండి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారని జెడిఎ చంద్రనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 1,73,591 రైతులకు రూ.34.72 కోట్లు విడుదల చేస్తారన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలోని స్మార్ట్ టివిలో లైవ్ టెలికాస్ట్ చేస్తారని చెప్పారు. లబ్ధిదారులు, రైతులు అందరూ ఈ కార్యక్రమాన్ని తమ రైతు సేవా కేంద్రం నుంచి వీక్షించాలని కోరారు.

పరిసరాలు శుభ్రపరుస్తున్న ఫార్మసీ విద్యార్థులు

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్వభావ స్వచ్ఛత సంస్కార్, స్వచ్ఛతలో భాగంగా పరిశుభ్రత-పచ్చదన కార్యక్రమం శుక్రవారం స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ బృందం వారు కళాశాల ప్రిన్సిపల్ డి.స్వర్ణలత ఆదేశాల మేరకు కార్యక్రమ నిర్వహణ అధికారి వై.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మన్నూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఆవరణలో పరిశుభ్రత యొక్క ఆవశ్యకతను తెలుపుతూ విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పరిమళతో కలిసి వివరించారు. ఫార్మాడి తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పాఠశాల ఆవరణ భాగమంతా శుభ్రపరిచారు. పాఠశాల విద్యార్థులచే ప్రకృతిని పరిరక్షించాలని, పరిశుభ్రతను పాటిస్తానని, మొక్కల యొక్క పెంపుదలకు తోడ్పడుతానని, సమాజానికి అవగాహన కల్పిస్తానని ప్రతిజ్ఞ చేయించారు.

పవన్ కల్యాణ్ పాలనపై దృష్టి పెట్టాలి : డిసిసి

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు గాజుల భాస్కర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రజాసేవ మరిచి సనాతన ధర్మం గురించి మాట్లాడడం చాలా విచిత్రంగా ఉందని సనాతన ధర్మం అంటే పూర్తిగా తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ విమర్శించారు. సినిమా దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్, రచయితలు పరుచూరి బ్రదర్స్, తెలుగు పండితులు సనాతన ధర్మం గురించి మాట్లాడితే అర్థముంటుంది గాని పవన్ మాట్లాడడం ప్రజాసేవ చేసే సమయాన్ని వృథా చేయడమే అవుతుందన్నారు. శుక్రవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ సనాతన ధర్మం గురించి చాలా గొప్పగా చెబుతున్నారు. పవన్ గతంలో చేసిన పనులకు ఇప్పుడు మాట్లాడే మాటలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. వారాహి అమ్మవారి దీక్ష చేసినప్పుడు ఆయన చెప్పులు ధరించి అందరికీ కనిపించారన్నారు. వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి బహుకరిస్తే చెప్పులు ధరించి పటాన్ని అందుకోవడం హిందూ ధర్మానికి, హిందు వులను కించపరచడమేకాదా అని విమర్శించారు. పదే పదే హిందూ మతం గురించి గొప్పగా చెప్పుతున్న పవన్ బిజెపి మెప్పు పొందడానికే తప్ప మరి ఏమీ లేదన్నారు. హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓట్లు వేశారని, ఫలితాలు అనంతరం బిజెపి గద్దె దిగి ఇంటికి వెళ్లడానికి సిద్ధంగా ఉందని పవన్ తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం కింద రూ.15 వేలు మరిచి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చకపోతే గతంలో వైసిపికి పట్టినగతే టిడిపి, జనసేన, బిజెపికి పడుతుందని ప్రభుత్వానికి హెచ్చరించారు కాంగ్రెస్ పార్టీ పెట్టిన 48 గంటల గడువుకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ యాజమాన్యం తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం పిసిసి అధ్యక్షులు షర్మిల, కాంగ్రెస్ విజయమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఏదైనా సాధించడంలో జనరంజకపాలన అందించడంలో కాంగ్రెస్ పార్టీకి సాధ్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు పాల్గొన్నారు.

మదనపల్లెలో మయూర బేకరీ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి పట్టణం బెంగళూరు బస్టాండులో కేరళకు చెందిన అద్భుతమైన రుచులతో అతి పెద్దగా మయూర బేకరీ అండ్ స్వీట్స్ ఏర్పాటు చేశారు. శుక్రవారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాలలో ఉండే విధంగా మదనపల్లి పట్టణంలో కూడా బేకరీ అన్ని రకాలు, స్వీట్స్, అదేవిధంగా ఫ్రూట్ జ్యూస్, టీ స్నాక్స్ ఒకే చోట పెద్ద షాపుగా ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. మదనపల్లి ప్రజలకు ఎంతో ఎంత అద్భుతమైన రుచులతో ఇక్కడ స్వీట్స్ బేకరీ ఐటమ్స్ దొరుకుతాయన్నారు. బేకరీ ఏర్పాటు చేసిన నిర్వాహకులు షాజిత్ బాలన్ అభివృద్ధి చెందాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణం వ్యాపారపరంగా అనుకూలంగా ఉంటుందని ఇక్కడి మిత్రుల సహకారంతో మయూర బేకరీ అండ్ స్వీట్స్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రజలందరూ కూడా మయూర బేకరీ అండ్ స్వీట్స్‌ను రుచి చూసి, తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఖాదర్ కుట్టి, ఆలీ, హరి, టిడిపి నాయకులు విద్యాసాగర్, ఎస్ఎ.మస్తాన్, సుధాకర, బాలు స్వామి, గాంధీ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మయూర బేకరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మహిళా పోలీస్ వైద్య ఖర్చులకు రూ.50 వేలు సాయం

ప్రజాశక్తి-రాయచోటి

సుండుపల్లి మండలం పోలిమేరపల్లిలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న వరలక్ష్మికి వైద్య ఖర్చులకు ప్రభుత్వం తరపున రూ.50 వేలను కలెక్టర్ శ్రీధర్ చామకూరి అందజేశారు. రాజంపేట డివిజన్ సుండుపల్లి మండలం పొలిమేరపల్లి గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి అక్టోబర్ 1న పింఛను పంపిణీ నిమిత్తం వెళుతుండగా అనుకోకుండా ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయాన్ని సుండుపల్లి మండల ఎంపిడిఒ కలెక్టర్ శ్రీధర్ చామకూరి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సదరు మహిళా పోలీసును చికిత్స నిమిత్తం రాయచోటిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి ప్రమాదానికి గురైన మహిళా పోలీస్ వరలక్ష్మిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందుతున్న వైద్య చికిత్స వివరాల గురించి సంబంధిత వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం తరపున తనకు ఆర్థిక సహాయం అందజేసిన కలెక్టరుకు మహిళా పోలీస్ వరలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, మహిళా పోలీసు బంధువులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్‌ను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీధర్

డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

బిసిజి టీకాలపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని సామకోట వారిపల్లిలో ప్రజలకు ఫ్రైడే డ్రైడే, బిసిజి టీకాలపై డాక్టర్ ప్రత్యూష పర్యవేక్షణలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. ఇళ్ల చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకో వాలని, దోమ తెరలు వాడాలని, కిటికీలకు మెష్ ఏర్పాటు చేసుకో వాలని అన్నారు. సాయంత్రం వేళ ఇళ్లలో పచ్చి వేపాకు పొగ వేసుకొని దోమల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలన్నారు. దోమల పెరుగుదల అరికట్టి మలేరి యా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలు ప్రబలకుండా చేసుకోవచ్చని అన్నారు. వయోజనులు టిబి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా బిసిజి టీకాలు వేసుకోవాలన్నారు. గత నాలుగు నెలలుగా ప్రతి సోమవారం, గురువారంలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు వేస్తున్నామని తెలిపారు. 2 లేదా 3 వారాలుగా దగ్గు వస్తూ ఉండటం, రోజూ సాయంత్రం జ్వరం రావడం, దగ్గినపుడు గళ్ళ పడుట, ఆయాసం, నీరసం, బరువు తగ్గిపోవుట, ఆకలి లేక పోవుట వంటి లక్షణాలు ఉంటే టిబి కావచ్చని అన్నారు. సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి గళ్ళ పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని కోరారు. అనంతరం సికిల్ సెల్ అనిమియా కరపత్రాలనుఆవిష్కరించి, ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, దేవ కుమారి, ఎంఎల్‌హెచ్‌పి నందిని, ఆశాకార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ఐగా లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా కె.లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆర్ఐగా పనిచేసిన రాజశేఖర్ పెనుగులూరు మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో లక్ష్మీదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పరిధిలో ప్రజలకు అవసరమైన పనులు చేసేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.

విద్యుత్ శాఖ ఎఇగా నాగరాజు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : మండల విద్యుత్ శాఖ నూతన ఎఇగా పి.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎఇ వసంత రెడ్డి మదనపల్లెకు బదిలీ కాగా, కురుబలకోటలో పనిచేస్తున్న పి.నాగరాజు నిమ్మనపల్లి మండల విద్యుత్ శాఖ ఎఇగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. వారికి నారాయణ, లైన్ ఇన్స్‌పెక్టర్ చక్రపాణి, వెంకటేష్ ఆధ్వర్యంలో లైన్‌మెన్లు, షిఫ్ట్ ఆపరేటర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించటానికి కృషి చేస్తామని అన్నారు. నిత్యం రైతులకు విద్యుత్‌శాఖ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. విద్యుత్ సౌకర్యాల కోసం రైతులు నేరుగా తమను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, లైన్ ఇన్స్‌పెక్టర్లు చక్రపాణి, వెంకటేష్, లైన్‌మెన్‌లు గోవింద్, కలాంబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ఎఇగా సుబ్రహ్మణ్యం

రైల్వేకోడూరు: రైల్వేకోడూరు పట్టణ విద్యుత్‌శాఖ ఎఇగా ఎన్.సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయనను ఎఇగా నియమిం చారని తెలి పారు. కోడూరు పట్టణ పరిధిలో విద్యుత్ శాఖ పరమైన సమస్యలు ఉన్న ట్లయితే వెంటనే తనకు తెలపాలని విద్యుత్ వినియో గదారుల కు అందు బాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్ప టికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు.

కలికిరి ఎంపిడిఒగా భానుమూర్తిరావు

కలికిరి: మండల నూతన ఎంపిడిఒగా భానుమూర్తిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన గంగయ్య బదిలీల్లో భాగంగా కురబల కోటకు వెళ్లగా వడమాలపేటలో పనిచేస్తున్న భానుమూర్తి రావు కలికిరి ఎంపిడిఒగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. గతంలో ఇక్కడ ఎఒగా పనిచేసిన అనుభవం ఉండటంతో నాయకులు, అధికారులు ప్రజలు సుపరిచితులు కావడంతో అందర్నీ సమన్వయం చేసుకొని మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అధికారులు, టిడిపి నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నందలూరు ఎంపిడిఒగా సుజాతమ్మ

ప్రజాశక్తి-నందలూరు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ సుజాతమ్మ

మండల నూతన ఎంపిడిఒగా జె.సుజా తమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అట్లూరు మండలం నుంచి సాధారణ బది లీల్లో భాగంగా నంద లూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపిడిఒ సౌభా గ్యమ్మ తిరుపతి జిల్లాలోని ఏర్పేడుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు.

పేరు మార్పు

షేక్ సలీం అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి సయ్యద్ హాసన్ మియా, ఇంటి నెంబర్ 26/146, రవి హాల్,రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు షేక్ సలీం గా వాడుకలో ఉన్న నా పేరును **సయ్యద్ సలీం బాషా** గా మార్చుకున్నాను.ఇక నుండి నా పేరు సయ్యద్ సలీం బాషా గమనించగలరు.

పేరు మార్పు

షేక్ హీరాజాన్ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. భర్త సయ్యద్ సలీం బాషా, ఇంటి నెంబర్ 26/146, రవి హాల్,రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు షేక్ హీరాజాన్‌గా వాడుకలో ఉన్న నా పేరును **సయ్యద్ హీరాజాన్**గా మార్చుకున్నాను.ఇక నుండి నా పేరు సయ్యద్ హీరాజాన్ గమనించగలరు.

పేరు మార్పు

షేక్ ఇందాద్ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి సయ్యద్ సలీం బాషా, ఇంటి నెంబర్ 26/146, రవి హాల్,రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు షేక్ ఇందాద్ గా వాడుకలో ఉన్న నా పేరును **సయ్యద్ ఇందాద్** గా మార్చుకున్నాను.ఇక నుండి నా పేరు సయ్యద్ ఇందాద్ గమనించగలరు.

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తాం

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

నూతన వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న మంజుల

నూతన వ్యవసాయ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుందని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల పేర్కొన్నారు. మహానంది వ్యవసాయ కళా శాలలో నాలుగవ సంవత్సరం వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ఆవిర్భావం , విధుల గురించి వారికి క్లుప్తంగా వివరించారు. జిల్లాలోని 30 మండలాల రైతాంగానికి నూతన వ్యవసాయ పద్ధతులను చేరవేయడం కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కెవికె శాస్త్రవేత్తలు జిల్లాలోని ప్రధానమైన పంటలు, పశుసంపద గురించి, వాటిలోని సమస్యలు, పరిష్కార మార్గాలు గురించి వివరించారు. ఈ మూడు నెలల శిక్షణా కాలంలో విద్యార్థులు రైతులతో మమేకమై, పంటలను తరచూ సందర్శించి, గ్రామీణ పరిస్థితులను గమనించి, జ్ఞానాన్ని సమర్థించుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మహానంది కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.పవన్ కుమార్‌రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం పార్వతిదేవి అలంకారంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం,నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్ఠి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్‌కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్** :స్థానిక నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవరోజు కుంకుమ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులకు అల్పాహార ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్పాహార దాతలు రామిశెట్టి రత్నమయ్య వారి కుటుంబ సభ్యులు, సిరివెల్ల ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు భవానీ నరసింహులు వారి కుటుంబ సభ్యులు అంజనమ్మ, మల్లికార్జున వారి కుటుంబ సభ్యులు వితరణ చేశారు.

బాలాత్రిపుర సుందరిదేవీగా చెర్లోపల్లి రెడ్డెమ్మ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మదనపల్లికి చెందిన బెల్లం రాజు ఉభయదారులుగా వ్యవహరించినట్లు తెలిపారు.

మసీదు భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం మైనార్టీలు

ప్రజాశక్తి-కలకడ

మసీదు భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని తహశీల్దార్ ఫణికుమార్‌కు కలకడ కు ముస్లిములు విన్నవించుకున్నారు. మండల కేంద్రంలో కలకడలో ఉన్న మసీదుకు సంబంధించి సర్వే నెంబర్ 163 ,164లలో ఉన్న ఐదు ఎకరాలు భూమిని ఆర్థిక వనరుల కోసం లాల్‌ఖాన్ వారసులు వలీ ఖాన్, రసూల్ ఖాన్, నవాజ్ ఖాన్, హుసేన్ ఖాన్, ఖాదర్ ఖాన్, బీబీజాన్‌లు కలిసి విక్రయించినట్లు తెలిపారు. అప్పట్లోనే ఈ భూమికి సంబంధించి ఒప్పం పత్రాలు రాసుకున్నట్టు తెలిపారు. ఈ భూమిని కలకడకు చెందిన కొందరు ఆక్రమించుకొని ప్లాట్లు వేస్తున్నట్లు గుర్తించి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మసీదు భూములను సర్వే చేయించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.

కొడుకు కోసం తల్లడిల్లుతున్న కన్నతల్లి

రెండు నెలలుగా గాలింపు
కువైట్ నుంచి వచ్చిన రెండు రోజులకే అదృశ్యం
భార్య, అత్త, మామలపై అనుమానం
కేసు నమోదు చేసిన పోలీసులు

మీడియాతో మాట్లాడుతున్న రాములమ్మ

వెంకటేశ్వర్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కొడుకు ఎటు వెళ్ళాడో, అసలు ప్రాణాలతో ఉన్నాడో లేడో కూడా తెలియక ఓ తల్లి తల్లడిల్లుతోంది. రెండు నెలలుగా ఊరు, వాడ గాలిస్తూ కొడుకు ఆచూకీ కోసం వెతుకులాడుతోంది. శుక్రవారం రాజంపేట మండల పరిషత్ కార్యాలయంలో తన కుమార్తె రాజేశ్వరితో కలిసి పాత్రికేయులను సంప్రదించి తన వేదనను వినిపించింది. పుల్లంపేట మండలం, వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన ఏరుకాల్వ సిద్దయ్య, రాములమ్మకు ఐదుగురు సంతానం. నలుగురు కూతుళ్లలో పెద్ద కుమారుడు వెంకటేశ్వర్లు. అతనికి ఐదేళ్ల క్రితం చిట్వేలి మండలం గాంధీనగర్ వడ్డిపల్లి కు చెందిన రేవతితో వివాహం జరిపించారు. అయితే వివాహం అయినప్పటినుండి కొడుకు, కోడలి మధ్య తరచూ గొడవలు జరిగేవని వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ తెలిపారు. పెళ్లయిన రెండు నెలలకు తన కుమారుడు వెంకటేశ్వర్లు జీవనోపాధి నిమిత్తం కువైట్ కు వెళ్లాడని, వివాహానికి ముందు కోడలు రేవతి కూడా కువైట్‌లోనే ఉండి వచ్చిందని తెలిపారు. కుమారుడు కువైట్ వెళ్లినప్పటి నుండి వారి మధ్య సమస్యలు ఎక్కువయ్యాయని, తరచూ వారి వైవాహిక జీవితంలో గొడవలతోనే సాగుతూ ఈ ఐదేళ్ల కాపురంలో ఇద్దరు సంతానం కలిగారని, వారికి గౌతమి (4), యశ్వంత్ (2) లు పిల్లలు ఉన్నారని తెలిపారు. రెండు నెలల క్రితం కువైట్ నుంచి వచ్చిన తన కుమారుడు వెంకటేశ్వర్లు తిరిగి కువైట్ దేశానికి వెళ్లేందుకు తన కోడలు రేవతి విమాన టికెట్ బుక్ చేసి మరలా తానే తన సోదరుడితో కలిసి బెదిరించి బత్తాక లాక్కొని బెదిరించారని వివరించారు. బత్తాక లేకుండానే తన కొడుకు కువైట్ వెళ్లాడని, వెళ్లిన 20 రోజులకే కోడలు రేవతి బలవంతంగా తన కొడుకును స్వదేశానికి రప్పించిందని తెలిపారు. వత్తలూరు వడ్డి పల్లెలో తన దగ్గర ఉన్న తన కుమారుడిని తన కోడలు రేవతి, ఆమె పెద్దమ్మ ఇందిరమ్మ తన కుమారుడిని అత్తగారింటికి తీసుకెళ్లారన్నారు. వెళ్లిన రోజే భార్య, భర్తల మధ్య గొడవ జరిగి ఆగస్టు 25 న భార్య, మామ తనను కొట్టి వేధించినట్లు తన కుమారుడు తమకు చరవాణి ద్వారా తెలియజేసి మరుసటి దినం ఆగస్టు 26 నుంచి కనిపించకుండా అదృశ్యమయ్యాడని ఆవేదన చెందారు. నాటి నుంచి నేటి వరకు రెండు నెలలుగా తన కుమారుడి కోసం తమకు తెలిసిన అన్ని ప్రాంతాలలో గాలిస్తున్నామని, నేటి వరకు ఆచూకీ తెలియరాలేదని విలపించారు. ఆగస్టు 27 న చిట్వేలి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశామన్నారు. ఇప్పటి వరకు తమ కుమారుడు ఆచూకీ లభ్యం కాలేదని ఏర్కొన్నారు., అమాయకుడైన తన కుమారుడికి మాయమాటలు చెప్పి తన కోడలు, అత్త-మామ తమ పుట్టింటికి తీసుకెళ్లి తన కుమారుడిని ఏదైనా చేశారా అని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ దిశగా విచారణ చేపట్టాలని కోరారు. తన కుమారుడి ఆచూకీ తెలిసినవారు 6304065931, 9505964196 అనే నెంబర్లకు గానీ, చిట్వేలి ఎస్ఐ రాఘరాంకు గానీ సమాచారం అందించి తన కొడుకును కాపాడాలని కోరుకుంటోంది.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణమోహన్

పోలీసులు నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలని రాయచోటి డిఎస్‌పి కృష్ణ మోహన్ తెలిపారు. ఎఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం శుక్రవారం డిఎస్‌పి పీలేరు పోలీస్ స్టేషనుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులతో మాట్లాడుతూ పట్టణంలో రాత్రిళ్లలో పోలీసుల గస్తీ పెంచాలని, ఎలాంటి నేరాలు, చోరీలు కానీ జరగకుండా నిఘా ఉంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతను ఎల్లవేళలా పరిరక్షించాలని ఆయన సచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ దరఖాస్తులు పూర్తి చేశాకే విఆర్‌ఒల రిలీవ్

ప్రజాశక్తి-పీలేరు

మాట్లాడుతున్న తహశీల్దార్

రెవెన్యూ భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేశాకే బదలీ అయిన విఆర్‌ఒ లను రిలీవ్ చేయడం జరుగుతుందని పీలేరు తహశీల్దార్ భీమేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విఆర్‌ఒలు వాటిని త్వరగా పూర్తిచేశాకే బదలీ ఉత్తర్వులు తీసుకోవాలని సూచించారు.

పీలేరు సీనియర్ సహాయకుడిగా వెంకటేశ్వరయ్య

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా నంద్యాల వెంకటేశ్వరయ్య బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లి హెచ్‌ఎన్‌ఎస్-ఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న వెంకటేశ్వరయ్యను ప్రభుత్వం పీలేరు రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేసింది. శుక్రవారం స్థానిక తహశీల్దార్‌ను కలిసి తన జాయినింగ్ రిపోర్టును అందించారు.. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ పెండింగ్‌లోని ప్రతి ఫైలును సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

దేశ సంస్కృతిని ప్రతిబింబించేదే నృత్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భారతదేశ సంస్కృతిని ప్రతిబింబించేదే శాస్త్రీయ నృత్యమని ప్రముఖ నృత్యకారుడు పెనిగలపాటి శివ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం నూనెవారిపల్లెలోని శివ డాన్స్ అకాడమీలో శాస్త్రీయ నృత్య కళాకారులచే గజ్జ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాస్టర్ మాట్లాడుతూ నటరాజు దీవెనలు కోరుతూ భక్తిశ్రద్ధలతో నిర్వహించే కార్యక్రమమే గజ్జ పూజ అని అన్నారు. ఈ కార్యక్రమం తన అకాడమీలో ప్రతి ఏటా దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహించడం జరుగుతుందని, మరలా మార్చి, ఏప్రిల్ మాసాలలో వచ్చే వసంత నవరాత్రి సందర్భంగా చేయడం జరుగుతుందని వివరించారు. దీనివలన విద్యార్థులలో సంస్కృతి సంప్రదాయాల పట్ల భక్తిశ్రద్ధలు పెరుగుతాయని తెలిపారు.

గజ్జపూజ చేస్తున్న చిన్నారులు

సిఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిటిడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టు వస్త్రాలు సమర్పించడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును రేణిగుంట విమాన శ్రయంలో ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డిలు కలిసి ఘనంగా స్వాగతం పలికారు. రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తామని సిఎం తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. నియోజకర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.

9న పుంగనూరుకు మాజీ సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఈనెల 9న వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరుకు రానున్నట్లు తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలో రెండు రోజుల క్రితం చిన్నారి అస్పియా అనుమానస్పదంగా మృతి చెందిందని తెలిపారు. చిన్నారి కుటుంబానికి వెళ్లి అన్నివిధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. 9న పుంగనూరుకు వచ్చి చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. చిన్నారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అస్పియా కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని అన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కదిరాయ చెరువు పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ లక్ష్మీ ప్రసన్న కమల్‌నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిదని నిర్వాహకులు తెలిపారు. తిరుపతి పట్టణానికి చెందిన రమాదేవి సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వైద్య సేవలు అందించారని తెలిపారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

తంబళ్లపల్లి ఎంపిడిఒగా ఉపేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో పీలేరు ఎంపిడిఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ ఎఒ గా థామస్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బి.కొత్తకోట ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. టైపిస్టుగా సురేంద్ర ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన మదనపల్లిలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సహచర కార్యాలయ ఉద్యోగుల అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

పేకాట రాయుళ్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పేకాట స్థావరం పై దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ చాంద్‌బాషా తెలిపారు. సిఐ కథనం మేరకు.. నీరు గట్టు వారిపల్లె కాట్లాటపల్లె రోడ్డు సమీపంలో పేకాట ఆడుతున్నట్లు డిఎస్‌పి కొండయ్య నాయుడుకు సమాచారం రావడంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం పేకాట స్థావరం పై దాడులు జరిపి ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ నిందితుల వద్ద రూ. 23వేలు నగదు సీజ్ చేసి వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆటో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా ఓ మహిళ స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లెలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కోసివారిపల్లెకు చెందిన పృథ్వీక్, షబానా దంపతులు ఎద్దులవారిపల్లె వద్ద వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. అదే మండలం రామాపురంకు చెందిన వినోద్ తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ డ్యూటీ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పృథ్వీక్, షబానా దంపతులు ఇద్దరూ వ్యవసాయ పనులు ముగించుకొని వారి ఆటోలో ఇంటికి బయలుదేరారని చెప్పారు. అదే సమయంలో వినోద్ సొంత పనుల నిమిత్తం మదనపల్లెకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా మూలపల్లె సమీపంలో చింతతోపు వద్ద ప్రమాదవశాత్తు ఇరువురి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో వినోద్, ఆటో నడుపుతున్న పృథ్వీక్ తీవ్రంగా గాయాలు కాగా షబానా స్వల్పంగా గాయపడినట్లు చెప్పారు. గమనించిన స్థానికులు బాధితులను తంబళ్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని అన్నారు. వినోద్‌కు మెరుగైన చికిత్స అవసరం అవడంతో వైద్యుల సూచనల మేరకు మదనపల్లికి తరలించినట్లు చెప్పారు.